క్లుప్తంగా

దేశానికి ఆదర్శంగా పథకాలు



నిజాంసాగర్(జుక్కల్): బడుగు, బలహీన వర్గాలు, కుల, మతాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. గురువారం మహమ్మద్‌నగర్ గ్రామంలో 30 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, నాయకులు చింతకింది కాశయ్య, రామాగౌడ్, తదితరులున్నారు.

రైతు బంధు సమితి గ్రామ కో–ఆర్డినేటర్‌గా రాజిరెడ్డి

భిక్కనూరు: బస్వాపూర్ గ్రామ రైతు బంధు సమితి కో–ఆర్డినేటర్‌గా గౌరిగారి రాజిరెడ్డిని నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నియామకపు ఉత్తర్వులను జారీచేశారు. ఇప్పటి వరకు రైతు బంధు సమితి గ్రామ కో–ఆర్డినేటర్‌గా ఉన్న మల్లారెడ్డి సీడీసీ డైరెక్టర్‌గా ఎంపికవడంతో ఆయన స్థానంలో గౌరిగారి రాజిరెడ్డిని నియమించాలని ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సిఫారసు మేరకు కలెక్టర్ నియమించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. తనకు పదవి రావడానికి కారణమైన గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

618 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో గురువారం 618 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 43 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 4,48,435 మందికి కంటి పరీక్షలు చేసి, 65,701 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 98.29శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు.

అనుమతితో పుస్తకాలను విక్రయించాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను విక్రయించడానికి డీఈవో కార్యాలయం నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే విక్రయించాలని డీఈవో ఎస్.రాజు గురువారం తెలిపారు. ఈనెల 7లోపు డీఈవో కామారెడ్డి పేరు మీద రూ.2 వేల డీడీని సమర్పించి అనుమతి పొందాలన్నారు. బుక్‌స్టాల్ యాజమాన్యాలు అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి కాపాడాలంటూ కాచాపూర్ గ్రామస్తులు వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి 38వ రోజుకు చేరుకున్నాయి. ప్రజాప్రతినిధులు ఫ్యాక్టరీ యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. బీజేపీ నేతలు సంఘీభావం తెలిపారు.

పనుల పరిశీలన

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాలోజివాడి శివారులో గల చెరువు కట్టపై జరుగుతున్న పనులను గురువారం ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణా దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా కొత్త చెరువు, ఊర చెరువులకు సంబంధించి కట్టలపై ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో దశాబ్ది ఉత్సవాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ లింగవ్వ, తదితరులు ఉన్నారు.

పోల్కంపేటలో చౌదరి చెరువు..

లింగంపేట(ఎల్లారెడ్డి): పోల్కంపేటలో చౌదరి చెరువును గురువారం ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోల్కంపేట చౌదరి చెరువు కట్టపై మన ఊరు మన చెరువు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని కోసం చెరువు కట్టపై ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ పద్మ, ఏఈఓ అరుణ ప్రభ, కార్యదర్శి అశ్వక్, గ్రామ పెద్దలు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

కామారెడ్డి రూరల్: శాబ్దిపూర్ గ్రామానికి చెందిన నాయిని రాజనర్సవ్వ గుడిసె కాలిపోవడంతో కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి గురువారం బాధితులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రాజనర్సవ్వ కూతురు నాయిని శోభ డెలివరీ ఖర్చు మొత్తం తానే భరిస్తానని పేర్కొన్నారు. నాయకులు తేలు శ్రీను, పండ్ల ప్రవీన్, నరేందర్, గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణగౌడ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బి రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

భవనం పూర్తయ్యేదెన్నడో?



బాన్సువాడలో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్ భవనం

- రోడ్డుపైనే కూరగాయల మార్కెట్
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ కూరగాయల విక్రయం

బాన్సువాడ: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ముందు ఉన్న రోడ్డుపై ఉదయం నుంచే కూరగాయల వ్యాపారులు ఎండలో కూర్చుని కూరగాయలను విక్రయిస్తుంటారు. ఎండకు ఎండుతూ..వర్షానికి తడుస్తూ కూరగాయలను అమ్ముతుంటారు. కూరగాయలు కొనుగోలు చేసే వారు రోడ్డుపైనే వాహనాలు నిలిపి కూరగాయలు కొనుక్కుని వెళ్తున్నారు. దీంతో వినియోగదారులతో పాటు అమ్మకందారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత వీక్లీ మార్కెట్‌లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవన పనులు మందకొడిగా కొనసాగుతుండడంతో కూరగాయల విక్రయదారులు అవస్థలు పడుతున్నారు. బాన్సువాడ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డు నుంచి మున్సిపాలిటీకి వెళ్లే దారిలో నిత్యం కూరగాయల విక్రయదారులు రోడ్డుపైనే కూరగాయలు పెట్టి విక్రయిస్తున్నారు. ఉదయం వేళల్లో ఈ రోడ్డు నుంచి వాహనదారులు వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. కొనుగోలుదారులు కూరగాయల కోసం వచ్చి వాహనాలను రోడ్డుపైనే నిలబెడుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇక్కడే కాకుండా పాత బాన్సువాడకు వెళ్లే దారిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి యూనియన్ బ్యాంకు వరకు కూరగాయల వ్యాపారులు రోడ్డుపైనే విక్రయిస్తున్నారు. పాత బాన్సువాడ, సంగమేశ్వర కాలనీ, దళితవాడ, శాంతినగర్, బేతాళస్వామి కాలనీలవాసులు ఇదే రోడ్డు మార్గంలో వెళ్తుంటారు. తాత్కాలికంగా ఎవరికి వారే నీడ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇబ్బంది పడుతున్న అమ్మకందారులు

ఎండ వేడిమికి ఇటు కొనుగోలుదారులు, అటు విక్రయదారులు తల్లడిల్లిపోతున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు మార్కెట్ కొనసాగుతుంది. కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు, సీజన్‌లో లభించే పండ్లు వంటివి మార్కెట్‌లో లభ్యమవుతుంటాయి. దీంతో నిత్యం వందలాది మంది మార్కెట్‌కు వస్తుంటారు. ప్రధాన రహదారులపైనే కూరగాయల విక్రయాలు కొనసాగుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఆధునిక హంగులతో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మించాలనేది స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిరకాల కోరిక. స్పీకర్ ప్రత్యేక కృషితో సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధులు మంజురు చేశారు. గతేడాది ఫిబ్రవరిలో పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించి 15 నెలలు కావస్తున్నా ఒక్కడుగు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అనేలా పనులు కొనసాగుతున్నాయి. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మందకొడిగా కొనసాగిస్తుండడంతో విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు, కూరగాయల వ్యాపారులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాల గురించి వివరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్): వ్యవసాయం, విద్యుత్, సాగు, తాగునీరు రంగాలలో సాధించిన గుణాత్మక మార్పులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు దశాబ్ది ఉత్సవాలలో ప్రజలకు వివరించి ఘనంగా జరుపుకుందామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పిలుపునిచ్చారు. గురువారం బిచ్కుంద రైతు వేదికలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2 నుంచి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాల్లో అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా తేదీలలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంఈవోల ఆధ్వర్యంలో 20న విద్యాదినోత్సవం చేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలోని ఒక్క ఎంఈవో కూడా సమావేశానికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్, ప్రొగ్రాం నోడల్ అధికారి జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీపీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల

ఎల్లారెడ్డి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ అధికారులతో సమావేశం నిర్వహించారు. 20 రోజుల పాటు జరిగే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. 2న జాతీయ పతాకావిష్కరణతో పాటు ప్రభుత్వం ప్రకటించిన విధంగా షెడ్యూల్‌ను అమలు చేయాలన్నారు. ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను, డీఎస్పీ శ్రీనివాసులు, ఏడీఏ రత్న, సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించండి



రెడ్డిపేటలో విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న అధ్యాపకులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): పదవ తరగతి పూర్తయిన పిల్లల్ని తల్లిదండ్రులు రామారెడ్డి ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరుతూ కళాశాల అధ్యాపక బృందం గురువారం రెడ్డిపేటలో గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రాజాగౌడ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులపై ఎలాంటి ఫీజుల భారం లేకుండా, ఇంటర్ పూర్తయ్యే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. తల్లిదండ్రులకు ఏమన్నా సందేహాలు ఉంటే నేరుగా కళాశాలకు వచ్చి వసతులు, విద్యాబోధనను పరిశీలించుకోవచ్చని సూచించారు.

భూసార పరీక్ష ద్వారా అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వ్యవసాయ భూమిలో భూసార పరీక్ష చేయించుకొని దాని ఫలితాన్ని బట్టి సరైన ఎరువులు, పురుగు మందులు వినియోగించి అధిక దిగుబడులు పొందవచ్చని కామారెడ్డి పట్టణం జేపీఎన్ రోడ్‌లోని జైహో కిసాన్ అగ్రిటెక్ కంపెనీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించారు. గురువారం కంపెనీ ఆధ్వర్యంలో భూంపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. కృత్రిమ మేధ సహాయంతో భూసార పరీక్ష ద్వారా రెండు నిమిషాల్లో ఫలితాలు అందించారు. రైతులు భూసార పరీక్ష లేదా వ్యవసాయ సంబంధిత సలహాల కోసం 9459491111 లేదా కామారెడ్డి జైహో కిసాన్ స్టోర్‌ను సంప్రదించవచ్చని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

పేదల సంక్షేమానికి కృషి చేయాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ నిరుపేదల సంక్షేమం కోసం కృషి చేయాలని తాము సంపాదించిన దాంట్లో కొంత ధనాన్ని సేవా కార్యక్రమాలకు అందించాలని హైకోర్టు న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ. రూ.5 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డి కులస్తుల్లో 95 శాతం రైతులే ఉన్నారన్నారని సంఘం తరపున రైతు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. రెడ్డి కులస్తుల్లో చాలామంది నిరుపేదలు కూడా ఉన్నారని వారి పిల్లల ఉన్నత చదువుల కోసం సహాయ సహకారాలను ప్రతి ఒక్కరూ అందించాలన్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం తరపున రాంరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు నాగన్నగారి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే మార్కెట్ కమిటీ కార్యాలయం



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

బిచ్కుంద(జుక్కల్): రైతుల కోసమే మార్కెట్ కమిటీ కార్యాలయం ఉందని, వారికి అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తామని ఎంపీపీ అశోక్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్ అన్నారు. గురువారం మార్కెట్ కమిటీ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 30 లక్షల నిధులతో ప్రహరి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర రాకుంటే వారి పంట ఉత్పత్తులను గోదాంలో భద్రంగా ఉంచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకొని లాభం పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాలాజీ, డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు రాజు, సాయిరాం పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు

బాన్సువాడ రూరల్: చిన్న రాంపూర్ గ్రామంలో గురువారం ముస్లిం స్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులను గ్రామస్తులు ప్రారంభించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రహరీ నిర్మాణం కోసం తొలి విడత రూ.5లక్షలు మంజూరు చేశారని వారు తెలిపారు. ప్రహరీ నిర్మించడం వల్ల స్థలం కబ్జా కాకుండా ఉండటంతో పాటు శుభ్రంగా ఉంటుందని వారు అన్నారు. గ్రామపెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, షేక్ అజీజ్, అక్బర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణం కోసం గురువారం గౌడ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ దామోదర్ రావు, జై గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ భవన ప్రహరీ నిర్మాణానికి..

కామారెడ్డి రూరల్: నర్సన్నపల్లిలో ముదిరాజ్ సంఘ భవన ప్రహరీ నిర్మాణానికి గురువారం కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి భూమిపూజ చేశారు. ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ ఆలయ ఉద్యోగి మృతి



సత్యనారాయణ

నిజామాబాద్ సిటీ : నగరంలోని కంఠేశ్వర్ ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే సత్యనారాయణ బుధవారం అర్ధరాత్రి మృతిచెందారు. సత్యనారాయణ మెదడులో కణితి కావటంతో ఆరోగ్యం దెబ్బ తిన్నది. నెలక్రితం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వ్యాధి నయం కాలేదు. చికిత్స నిమిత్తం డబ్బులు సరిపోకపోవడంతో ఇటీవలే నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవాదాయ సహాయక కమిషనర్ ఎస్ సుప్రియ, కంఠేశ్వర్ ఆలయం ఈవో వేణు, ఇతర సిబ్బంది వెంటనే ఆస్పత్రికి చేరుకుని ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం మృతుడి భార్యకు కమిషనర్ అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ. 10 వేలు అందజేశారు. మృతుడి స్వస్థలం కామారెడ్డి జిల్లా రామారెడ్డికి తీసుకెళ్లగా గురువారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆయన మృతిపట్ల ఉమ్మడి జిల్లాల అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ రాములు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఉద్యోగుల సంఘం తరపున రూ. 5 వేలు మృతిచెందిన కుటుంబానికి అందజేశారు.



సత్యనారాయణ భార్యకు ఆర్థిక సాయం చేస్తున్న దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ సుప్రియ

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన తోడెంగల భవ్య(17) గురువారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతికి గల కారణాలు తెలియాల్సింది. ఈ ఘటన గురించి ఎస్సై రాజును వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అందిన అనంతరం దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): బోరుబావికి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ తగిలి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం పూట జరిగింది. రామారెడ్డి పోలీసులు తెలిపిన వివరాలు.. మద్దికుంట గ్రామానికి చెందిన గజ్జల లింగం(40) బోరు బావి చెడిపోగా, మరో మూడు నాలుగు పైపులు తీసుకొచ్చి మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్ తగలడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఏఎస్సై సుభాషిణి తెలిపారు.

పింఛన్ అవకతవకలపై ఫిర్యాదు

దోమకొండ: ముత్యంపేటలో పింఛన్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని గ్రామ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గురువారం ఎంపీడీవో చిన్నారెడ్డితో పాటు బ్రాంచ్ పోస్టుమాస్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవకతకవలు జరుగుతున్నాయని బీపీఎం నితీషను ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తించారన్నారు. ఈ విషయంలో విచారణ జరిపించాలని కోరారు.

ఆధ్యాత్మికం..

ఊరడమ్మ పండుగకు సిద్ధం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే ఊరడమ్మ పండుగకు గ్రామ దేవత మూర్తులను విశ్వ బ్రాహ్మణులు సిద్ధం చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వడ్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేమికలాన్ గ్రామ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేమికలాన్ గ్రామం నుంచే కాకుండా ఇతర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడి బియ్యం, నూతన వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నారు.

నెమ్లి సాయి ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లిలోని షిర్డి సాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం ఖాగడ హారతి, మధ్యాహ్నం మహా అన్నదానం, సాయంత్ర పల్లకీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



భిక్కనూరు: మండల కేంద్రంలో గంగామాత ఉత్సవాల్లో భాగంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవున పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు, యువతుల దాండియా పలువురిని ఆకట్టుకున్నాయి.

బీబీపేటలో..

బీబీపేట: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి, ముత్యాలమ్మ, పోచమ్మ, నాయికమ్మ ఆలయాల ఉత్సవాలు నాలుగు రోజులుగా కొనసాగుతున్నాయి. మున్నూరు కాపు సదరు సంఘం ఆధ్వర్యంలో గురువారం మహిళలు బోనాలు తీసి ఊరేగించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

భిక్కనూరు: మండల కేంద్రలోని గంగామాత ఆలయంలో ధ్వజ స్తంభాన్ని గురువారం ప్రతిష్ఠించారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డిలు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కట్నకానుకలు సమర్పించుకున్నారు.

చుక్కాపూర్ ఆలయంలో నరసింహ హోమం

మాచారెడ్డి: చుక్కాపూర్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా గురువారం హోమం నిర్వహించారు. జెడ్పీటీసీ మినుకూరి రామ్‌రెడ్డి, తిరునగరి క్రిష్ణ కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల



కామారెడ్డి టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో ఏం సాధించిందని దశాబ్ది ఉత్సవాలను చేస్తున్నారని ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. గురువారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్రభుత్వం గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలతో చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చందు మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్లో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎమ్మెలలు, మంత్రులే రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. నాయకులు సందీప్, ప్రవీణ్, నరేష్, సోఫియాన్, శ్రీధర్ పాల్గొన్నారు.

రైతులు హాజరయ్యే విధంగా చూడండి

కామారెడ్డి క్రైం: ఈ నెల 3న రైతు దినోత్సవం వేడుకలకు అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యే విధంగా చూడాలని జిల్లా రైతు బంధు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు దినోత్సవం సన్నాహక సమావేశం నిర్వహించారు. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ ద్వారా ప్రయోజనం పొందిన రైతులతో సమావేశంలో మాట్లాడించాలన్నారు. అనంతరం రైతు దినోత్సవం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి డీఏవో వీరస్వామి తదితరులున్నారు.

రాహుల్ గాంధీకి స్వాగతం పలికిన మదన్ మోహన్

కామారెడ్డి టౌన్: అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వాషింగ్టన్ డీసీ నగరంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.

సంక్షిప్తం

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని ఎల్లారెడ్డి గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ వాణి గురువారం తెలిపారు. ఈ నెల 15 లోగా ఆన్‌లైన్‌లో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో..

కామారెడ్డి అర్బన్: వాసవీకాలనీలోని తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ తెలిపారు. వివరాలకు 8978847884 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

కార్పొరేట్ జూనియర్ కళాశాలలో..

కామారెడ్డి అర్బన్: కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఉచిత ప్రవేశాలకు జూన్ 3 లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధివృద్ధి అధికారి పి.వెంకటేష్ తెలిపారు. పదవ తరగతిలో 7 జీపీఏ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు https://telanganaepass.cgg.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆర్యక్షత్రియ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

కామారెడ్డి అర్బన్: ఆర్యక్షత్రియ యువసేన ఆధ్వర్యంలో జిల్లాలోని ఆర్యక్షత్రియ పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు జూన్ 4న కామారెడ్డి సాందీపని కళాశాలలో ప్రతిభ అవార్డులు అందజేయనున్నట్లు యువసేన ప్రతినిధులు సంతోష్, శ్యాంరావు, కృష్ణాకర్‌రావులు తెలిపారు. వివరాలకు 9959929739 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పనులు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. రాఘవపల్లి శివారులోని కొత్తకుంటలో చేపట్టిన ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను ఆయన తనిఖీ చేశారు.

ఓటరు కార్డుల్లో తప్పులను సరిదిద్దుకోండి

బాన్సువాడ రూరల్: ఓటర్ ఐడీ పోర్టల్ అందుబాటులోకి వచ్చిందని ఓటర్ కార్డుల్లో తప్పులుంటే సంబంధిత బీఎల్‌వోలను సంప్రదించి సరిదిద్దుకోవాలని తహసీల్దార్ గంగాధర్ సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలి

లింగంపేట(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీ బలోపేతాని కి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని లింగంపేట మండ ల ఎస్టీ సెల్ అధ్యక్షుడు వినోద్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం పర్మళ్ల మాలోత్ తండాలో ఆ యన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అ భ్యర్థి గెలుపు కోసం కష్టపడాలన్నారు. అనంతరం ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి ఆదేశా ల మేరకు పర్మళ్ల ఎస్టీ సెల్ కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా సురేష్ నాయక్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నరేష్, చందు తదితరులు పాల్గొన్నారు.